ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

సోమవారం 2 సెప్టెంబరు 2024

ఓటరుగా

పేరు నమోదు చేసుకోండి

- మార్పులు, చేర్పులు మొదలు
- ఓటర్ల జాబితా సవరణకు చర్యలు
- ఇంటింటా సర్వేలో బీఎల్‌వోలు

ఓటరు నమోదుపై ఎన్నికల సంఘం మరోసారి దృష్టి సారించింది. ఏటా చేపట్టే తరహాలోనే ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి కొత్తవాటి నమోదుతో పాటు మృతులు, శాశ్వత వలస ఓటర్ల తొలగింపు, సవరణల నిమిత్తం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎన్నికల అధికారులతో ఇప్పటికే సమీక్షలు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి ఓటర్ల నమోదు చేపడుతున్నారు. 2025 జనవరి 6న తుది జాబితా విడుదల చేయనున్నారు.

- చిత్తూరు కలెక్టరేట్



ఉన్నారా.. మారారా?

అర్హులై ఉండి సకాలంలో దరఖాస్తు చేసుకోలేకపోవడంతో మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో పలువురు ఓటు వేయలేకపోయారు. ప్రస్తుతం తుది జాబితాలో ఉన్న ఓటర్ల వివరాల ప్రకారం బీఎల్‌వోలు సర్వే నిర్వహిస్తున్నారు. జాబితాలో ఉన్న చిరునామాలోనే ఓటరు ఉంటున్నారా, మార్పు చేయాలా.. పేర్లు, చిరునామా వంటివి సక్రమంగా ఉన్నాయా.. లేవా? ఓటరు ఫొటో బాగుందా లేదా మార్చాలా తదితర అంశాలపై బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నారు. సవరణలకు ఫారం-6, 7, 8 వంటివి అందిస్తున్నారు.

సర్వే ఎప్పటి వరకు: అక్టోబరు 18

ముసాయిదా జాబితా: అక్టోబరు 29

అభ్యంతరాల స్వీకరణ: డిసెంబరు 24 వరకు

తుది జాతా ప్రచురణ: 2025, జనవరి 6 వరకు

యాప్‌లో వివరాల నమోదు

2025 జనవరి 1వ తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు హక్కుకు అర్హులు. ఈ మేరకు చేర్పుల నిమిత్తం కుటుంబంలో ఎవరైనా ఉన్నారా అనే వివరాలను బీఎల్‌వోలు నమోదు ప్రక్రియను చేపట్టారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో ఇటీవల ఎన్నికల సమయంలో విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించారు. మరోసారి వాటి వివరాలు సేకరించనున్నారు. వీటిని ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు.

అసెంబ్లీ నియోజక వర్గాల వారీ తుది జాబితా ప్రకారం ఓటర్ల వివరాలివీ

పుంగనూరు	238868
నగరి	202574
జీడీ నెల్లూరు	204949
చిత్తూరు	202850
పూతలపట్టు	220999
పలమనేరు	267896
కుప్పం	225775
మొత్తం ఓటర్లు	1563911

అక్రమం.. డబ్బులిస్తే సక్రమం!

అక్రమ, అనధికార లే అవుట్లు.. కొందరికి డబ్బులిస్తే సక్రమం అయిపోతున్నాయ్. అధికారులు వీటి జోలికి వెళ్లడం లేదు. నిర్వాహకులు ఎంచక్కా ప్లాట్లు అమ్మేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురైనా తమకు సంబంధం ఉండదని నిర్వాహకులు అనుకుంటున్నారు. ఇక, 'డీల్' కుదరకుంటే మాత్రం అక్రమ లే అవుట్లంటూ నోటీసులు ఇస్తున్నారు. ఇలా.. చిత్తూరు పట్టణ ప్రణాళిక విభాగ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

- చిత్తూరు

- చిత్తూరులో అనధికార లే అవుట్లకు బేరసారాలు
- పట్టణ ప్రణాళిక విభాగం తీరుపై విమర్శలు



చిత్తూరు నగర పరిధిలో అనధికార లే అవుట్లు రోజుకొకటి పుట్టుకొస్తున్నాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పొలాలు, కాలువలు, డీకేటీ భూముల్ని ఆక్రమించి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి అనధికార లే అవుట్లను గుర్తించి ప్రభుత్వానికి రావాల్సిన ఛార్జీలను వసూలు చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు వారితో కలిసి పోతున్నారన్న ఆరోపణలున్నాయి. లే అవుట్లకు నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం.. జిల్లా టౌన్‌ప్లానింగ్ అండ్ కంట్రీప్లాన్ శాఖ ద్వారా పరిశీలన, అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే సదరు లే అవుట్‌కు తుది అనుమతిని నగరపాలక సంస్థ కమిషనర్ జారీ చేయాలి. కానీ, నిబంధనల ప్రకారం అనుమతి పొందాలంటే.. ప్రభుత్వం చెప్పినట్లు వీధుల వెడల్పు, పబ్లిక్ అవసరాలకు స్థలం వదలాలి. పన్నులు కట్టాలి. ఇవన్నీ చేయాలంటే నిర్వాహకులకు ఎక్కువ ఖర్చవుతుంది. అందుకని చాలామంది అనధికారికంగా లే అవుట్లు వేస్తున్నారు. చిత్తూరు నగరంలో 150 వరకు అనధికార లే అవుట్లు ఉన్నట్లు అధికారులే పత్రికా ప్రకటన కూడా ఇచ్చారు. ఇలాంటి లేఅవుట్లను నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం గుర్తించి నోటీసులివ్వాలి. నిబంధనల ప్రకారం లే అవుట్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలి. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ, నిర్వాహకులతో లాలూచీ పడి కొందరు అధికారులు దీనిని సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల లే అవుట్‌లో ప్లాటు అడుగుతున్నట్లు తెలిసింది. ఇలా డీల్ కుదిరిన లే అవుట్ల జోలికి వీరు వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. మిగతా లేఅవుట్ల నిర్వాహకులకు మాత్రం నోటీసులు ఇవ్వడం, సదరు స్థలాలు రిజిస్ట్రేషన్లు కాకుండా సర్వే సంఖ్యల సహా రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖలు పంపిస్తున్నారు. ఆ తర్వాత వీళ్లా సంబంధిత అధికారులతో మాట్లాడితే లైన్ క్లియర్ చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇటీవల అది నంతగా ఇవ్వలేదని కారణంతో ఉషా నగర్‌కాలనీలో ఓ లే అవుట్‌కు తుది అనుమతి ఇవ్వకుండా నిలిపేశారు. ఎకరా విస్తీర్ణంలో ఉన్న లే అవుట్‌కు కనీసం రూ.లక్ష వరకు తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. అంతేకానీ, అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. 150 వరకున్న అనధికార లే అవుట్లలో సగానికి పైగా వదిలేశారని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. కాసులకు కక్కుర్తి పడిన కొందరు అధికారుల తీరుతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయాన్ని గండి పడుతోంది. గత ప్రభుత్వంలో అక్రమార్జనకు పాల్పడిన అధికారుల్లో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. వసూళ్లలో పేరుపొందిన ఓ అధికారి సచివాలయ ప్రణాళిక విభాగం కార్యదర్శుల్ని అడ్డంపెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

నేడు విద్యా సంస్థలకు సెలవు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 1: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, విద్యా సంస్థలు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, అందరూ పాటించాలని పేర్కొన్నారు.



సీపీఎస్ ఉద్యోగుల నిరసన

ప్రభుత్వ ఉద్యోగులకు 'చీకటి రోజు'

- సీపీఎస్ అమల్లోకి వచ్చిన రోజును పురస్కరించుకుని నిరసన

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 1: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) అమల్లోకి వచ్చిన సెప్టెంబరు ఒకటో తేదీని చీకటి రోజుగా పరిగణిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సమీర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ విధానం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)గా మారిన సెప్టెంబర్ ఒకటో తేదీ ఉద్యోగులకు దుర్దినంగా పేర్కొన్నారు. దీనిద్వారా ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ తర్వాత తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. సీపీఎస్ రద్దుపై ఉద్యమాల నేపథ్యంలో జీపీఎస్‌గా, ఆపై ఎన్‌పీఎస్‌గా, తాజాగా యూపీఎస్‌గా పేర్లు మార్చి ఉద్యోగులకు నష్టాన్ని కలిగిస్తున్నారన్నారు. వీటన్నింటిని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహులు, ఉపాధ్యక్షుడు లోకేష్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి : ఎస్టీయూ

సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఎస్టీయూ నాయకులు ఆదివారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్మోహన్, మోహన్ యాదవ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ విధానానికి యూపీఎస్ అనే ముసుగు వేసి అమలు చేయాలని అనుకోవడం సరికాదన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేసి న్యాయం చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటా మోహన్, పురుషోత్తం, జనార్దన్, జిల్లా నాయకులు రమణారెడ్డి, యువరాజు, చంద్రన్, చిట్టిబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

రాజనాలబండలో ఉట్లోత్సవం


ఉట్లు కొడుతున్న యువకులు

ప్రత్యేకాలంకరణలో రాజనాలబండ ఆంజనేయస్వామి (ఇన్‌సెట్‌లో) - పాకుమాను పాకుతున్న యువకులు

- పాకుమాను పాకిన పెద్దూరు యువకులు
- తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులు

చౌడేపల్లె, సెప్టెంబరు 1: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ తిరునాళ్లలో రెండో రోజైన ఆదివారం ఉట్లోత్సవం జరిగింది. ఇవి టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న తొలి తిరునాళ్లు. కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి, క్షేత్రపాలకుడైన వీరాంజనేయ స్వామికి ఉదయాన్నే అర్చకులు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చౌడేపల్లె, కాగతి, కొండామర్రి గ్రామస్తులు కలశాలను ఊరేగింపుగా రాజనాలబండకు తీసుకొచ్చి స్వామి వారి వద్ద పూజలు చేశారు. అనంతరం కొలింపల్లెలోని బోయకొండ గంగమ్మ ఉత్సవమూర్తి, ఊటూరు, దాసరయ్యగారిపల్లె, పెద్దూరు దేవరెద్దులను ఏగువ, దిగువ గాజులవారిపల్లె, మర్రిమాకులపల్లె, పెద్దూరు, కొత్తగూబలవారిపల్లె, వెంగళపల్లె, కొలింపల్లె, ఊటూరు, కొండామర్రి గ్రామాలలో పురవీధుల్లో చెక్కభజనలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగిస్తూ రాజనాలబండకు చేరుకున్నారు. ఆలయం ముందున్న నాలుగు కాళ్ల మండపం వద్ద అమ్మవారిని ప్రతిష్ఠించారు. అనంతరం 50 అడుగుల ఎత్తయిన పాకుమానుకు ఆముదం, ఆవాలు, కలమందగుజ్జు తదితర సహజసిద్ధ లేపనాలు పూసి పైన స్వామివారి ప్రసాదం ఏర్పాటు చేశారు. మల్లెలవారిపల్లె, మర్రిమాకులపల్లె, గాజులవారిపల్లె, వెంగళపల్లె, కొలింపల్లెకు చెందిన పాపుగాని వంశ వారసులు ఈ పాకుమాను పాకడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది పెద్దూరుకు చెందిన యువకులు పాకుమానును పాకి స్వామివారి ప్రసాదం దక్కించుకున్నారు. అనంతరం ఆలయం ముందున్న నాలుగు కాళ్ల మండపాలు మూడింటిలో చౌడేపల్లె, కాగతి, కొండామర్రి గ్రామాల నుంచి తీసుకొచ్చిన కలశాలకు పూజలు నిర్వహించి, ఉట్లు ఏర్పాటు చేశారు. చిప్పలివారిపల్లె, మల్లెలవారిపల్లె, మోట్లపల్లె గ్రామానికి చెందిన యువకులు ఉట్లు కొట్టి స్వామివారి ప్రసాదం దక్కించుకున్నారు. ఉభయతెలుగు రాష్ట్రాల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచే భక్తులు తరలిరావడంతో రాజనాలబండ కిక్కిరిసింది. గంటల తరబడి క్యూలైన్లలో భక్తులు వేచివుండి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాజనాలబండ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. మూడు గ్రామాల దేవరెద్దులకు భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. తిరునాళ్లలో దేవరెద్దులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో రాజనాలబండలో రెండు రోజుల తిరునాళ్లు ముగిశాయి.


గరుడవాహనంపై లక్ష్మీనరసింహస్వామి ఉత్సవర్లు







ప్రత్యేక ఆకర్షణగా దేవరెద్దు - భక్తులు, అంగళ్లతో సందడిగా రాజనాలబండ - ప్రత్యేకాలంకరణలో కొలింపల్లె బోయకొండ గంగమ్మ

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు, సెప్టెంబరు 1: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు వినతులు సమర్పించవచ్చునని పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ తెలిపారు.

గ్రానైట్ వాహనం పట్టివేత

గుడుపల్లె, సెప్టెంబరు 1: గుడుపల్లె మండలం పరిధిలో అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. శాంతిపురం మండలంలోని క్వారీల నుంచి తమిళనాడుకు రాత్రి వేళల్లో గ్రానైట్ తరలుతున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. కుప్పం -పలమనేరు జాతీయ రహదారిపై శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వాహనంలో గ్రానైట్ తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో సీజ్ చేశారు. పోలీసు స్టేషన్‌కు తరలించారు. పలమనేరు ఎంవీఐ మధుసూదన్ రూ.67,680 జరిమానా విధించారు.



వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

ప్రజలకు ట్రాన్స్‌కో ఈఈ సూచన



చిత్తూరు రూరల్, సెప్టెంబరు 1: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తడిసిన కరెంటు స్తంభాలు ముట్టుకోవద్దన్నారు. రైతులు తడి చేతులతో స్టార్టర్లను, మోటార్లను తాకరాదని సూచించారు. విద్యుత్ లైనుకు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దన్నారు. పార్కులు, స్టేడియాల్లో విద్యుత్ లైటు స్తంభాలను పట్టుకోవడం లాంటివి చేయకూడదని పేర్కొన్నారు. పిల్లలను కరెంటు వస్తువులకు దూరంగా ఉంచాలన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చేటప్పుడు డిష్ కనెక్షన్, టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్ స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. గ్రామాల్లో ఫ్యూజు పోయినప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలే తప్పా రైతులే వేసే ప్రయత్నం చేయరాదన్నారు.



తిరుపతికి అంతర్జాతీయ విమానం వచ్చేసిందోచ్!



డాక్టర్ రవిపిళ్ళైకి స్వాగతం పలుకుతున్న కోలా ఆనంద్

రేణిగుంట, సెప్టెంబరు 1: ఎట్టకేలకు తిరుపతి విమానాశ్రయంలో తొలిసారిగా ఓ అంతర్జాతీయ విమానం సేఫ్‌గా ల్యాండైంది. 2015 నవంబరు 22వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ద్వారా తిరుపతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. చంద్రబాబు ముందుచూపుతో అప్పట్లోనే అంతర్జాతీయ విమాన రాకపోకల కోసం అన్ని వసతులను కల్పించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్జాతీయ విమానాల రాకపోకలపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడటం, తిరిగి చంద్రబాబు సీఎం అయిన మూడు నెలల్లోపే అంతర్జాతీయ విమానం రావడంతో ఇటువంటి విమానాల రాకపోకలకు తొలి అడుగు పడిందనే చెప్పుకోవాలి. ఆదివారం మధ్యాహ్నం 12.11 గంటలకు బహ్రెయిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎంపైర్ ఏవియేషన్ విమానం నేరుగా తిరుపతి విమానాశ్రయంలో ల్యాండైంది. గల్ఫ్‌దేశంలో స్థిరపడిన కేరళకు చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ రవి పిళ్లై కుటుంబ సభ్యులతో కలిసి ఈ విమానంలో శ్రీవారి దర్శనార్థం తిరుపతికొచ్చారు. ఏటా శ్రీవారి దర్శనానికి వచ్చే ఈయన ఈసారి కేంద్రప్రభుత్వ అనుమతితో ప్రత్యేక విమానంలో వచ్చారు. దీనివల్ల భవిష్యత్తులో అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపడానికి ఇది తొలి అడుగుగా విమానాశ్రయ అధికారులు భావిస్తున్నారు. కాగా, రవిపిళ్లైకి విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికారు.



శ్రీవారి సేవలో హన్సిక

సినీ నటి హన్సిక ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన తల్లి మోనా మొత్వానితో కలిసి ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయం ముందుకు వచ్చిన హన్సికను అభిమానులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వేణుప్రసాద్ (ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, సెప్టెంబరు1: ఉదయం పుట్టిన రోజు చేసుకుందామని స్నేహితులతో చెప్పి బయలుదేరిన కాసేపటికే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పట్టణంలోని ఎన్ఎస్‌పేటకు చెందిన నారాయణ కుమారుడు వేణుప్రసాద్(20) రామసముద్రం మార్గంలోని ఐస్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. ఆదివారం పుట్టిన రోజు ఘనంగా జరుపుకోవాలని తన స్నేహితులకు చెప్పాడు. శనివారం అర్ధరాత్రి వరకు వారితో గడిపి ద్విచక్రవాహనంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో ఇంటికి వెళుతుండగా ఓ లారీని ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పుట్టినరోజు నాడే చనిపోవడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది.

యువతి ఆత్మహత్య



మృతిచెందిన కన్మణి

గంగవరం, సెప్టెంబరు 1: తండ్రి అసహనాన్ని భరించలేక క్షణికావేశంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పలమనేరు మండలంలోని టి.వడ్డూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. టి.వడ్డూరు గ్రామానికి చెందిన లోకేష్ కుమార్తె కన్మణి (18) రెండేళ్లుగా ఆరోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ఆమె తల్లికి కూడా మూడు రోజులుగా ఆరోగ్యం సరిగాలేదు. ఈ క్రమంలో వైద్యం విషయమై లోకేష్ అసహనంతో మాట్లాడటాన్ని విన్న కన్మణి.. ఓ గదిలోకి వెళ్లి ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కాపాడి వెంటనే పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే దుకాణంలో చోరీ



సీసీ కెమెరాలోరికార్డయిన దుండగులు

పెద్దపంజాణి, సెప్టంబరు 1: పెద్దపంజాణిలో జాతీయ రహదారి పక్కన ఉన్న దుకాణంలో చోరీ జరిగింది. మండల కేంద్రంలో బెరపల్లె గ్రామానికి చెందిన క్రిష్ణారెడ్డి శ్రీసాయిట్రేడర్స్ పేరుతో హోల్ సేల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆది వారం తన కుమార్తెను దుకాణంలో ఉంచి పనిపై బయటకు వెళ్లాడు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి పేపర్ ప్లేట్స్ కావాలని అడిగారు. దుకాణంలో ఉన్న అమ్మాయి ర్యాక్‌లో ఉన్న ప్లేట్స్ తీసుకొస్తుండగా డ్రా ఓపెన్ చేసి అందులో ఉన్న రూ.30వేలు చోరీ చేసి పారిపోయారు. అమ్మాయి గట్టిగా కేకలువేసింది. అప్పటికే వారు పరారయ్యారు. క్రిష్ణారెడ్డి సమాచారం అందు కుని పక్క దుకాణం వద్ద సీసీ కెమెరాలు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గంజాయి మత్తులో వాహన యజమానిపై హత్యాయత్నం

దుండగుల కోసం గాలింపు చర్యలు



చికిత్స పొందుతున్న రమేష్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 1: గంజాయి మత్తులో వాహన యజమానిపై గుర్తు తెలియని దుండగులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి.. వెదురుకుప్పం మండలం చిన్నగారిపల్లికి చెందిన రమేష్ టాటా ఏస్ వాహనంలో లగేజీ తోలుతూ జీవనం గడుపుతున్నాడు. ఈక్రమంలో శనివారం తన వాహనంలో బ్యాటరీలు తీసుకెళ్లి నాయుడుపేట-శ్రీకాళహస్తి మార్గంలోని ఒక బ్యాటరీ కంపెనీలో అన్‌లోడ్‌చేసి వచ్చాడు. శనివారం అర్ధరాత్రి దాదాపు 1.30 నుంచి 2 గంటల ప్రాంతంలో తనపల్లి క్రాస్‌లోని గ్రీన్ ల్యాండ్ కేఫ్ వద్ద వాహనం ఆపి టీ తాగుతుండగా గుర్తు తెలియని దుండగులు ఇద్దరు అతడి వద్దకు వచ్చారు. అప్పటికే గంజాయి సేవించి వున్న వారు మత్తులో అతడి వద్దకెళ్లి వాహనం ఇక్కడ ఎందుకు ఆపి టీ తాగుతున్నావు అంటూ ఒక్కసారిగా దాడికిదిగారు. రమేష్ వారిని అడ్డుకోగా, దుండగుల్లో ఒకరు తన వద్ద వున్న కత్తితో అతడిపై దాడి చేశాడు. మరో దుండగుడు చేతులు, కాళ్లపై కొట్టడంతో అతడు స్పృహ తప్పి పడిపోయాడు. విషయం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రమేష్ మణికట్టు, ఎడమ వైపు కడుపుపై బలమైన గాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. డీఎస్పీ నరసింగప్ప ఆదేశాల మేరకు పోలీసులు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హైవేపై వున్న సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో గత 10 రోజుల వ్యవధిలో మూడు చోట్ల చోటు చేసుకున్నా పోలీసులు గంజాయి బ్యాచ్‌ను గుర్తించి అరెస్టు చేయడంలో విఫలమవుతున్నారు. పోలీసుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

స్విమ్స్‌లో బీఎస్సీ, బీపీటీ కోర్సులకు రేపు, ఎల్లుండి 2వ వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1: స్విమ్స్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ(నర్సింగ్), బీపీటీ, బీఎస్సీ(పారామెడికల్) కోర్సుల ప్రవేశానికి మంగళ, బుధవారాల్లో 2వ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు స్విమ్స్ వెబ్‌సైట్‌లో లింకు ద్వారా కోర్సులను ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా విద్యార్థులకు సమాచారం వస్తుందని తెలిపారు.వివరాలకు స్విమ్స్‌వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.53 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.4.53 కోట్లు సమకూరింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 81,207 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,414 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీ సీఈ బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్వరరావు

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చీఫ్ ఇంజనీర్(సీఈ)గా టీవీ సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. సీనియార్టీ ఉన్నప్పటికీ తనకు చీఫ్ ఇంజనీర్‌గా ప్రదోన్నతి కల్పించలేదని, తనకన్నా జూనియర్‌గా ఉన్న నాగేశ్వరరావుకు పదోన్నతి కల్పించారంటూ ఎస్ఈ సత్యనారాయణ కొన్నేళ్లుగా కోర్టు ద్వారా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. కోర్టు కూడా స్పందిస్తూ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా పదోన్నతి కల్పించాలని, సీఈ పోస్టుకు సత్యనారాయణ అర్హుడని స్పష్టం చేసింది. డీపీసీ(డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) నియమ నిబంధనలు పాటిస్తూ సత్యనారాయణను 2020 నుంచే సీఈగా పరిగణించాలని జూలై నెలలో తీర్పు వెలువడిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ప్రభుత్వం మారిన తర్వాత జరిగిన బదిలీల్లో ఆయన ఎస్ఈ-2 కింద తిరుపతినుంచి తిరుమలకు వచ్చారు. ప్రస్తుతం సీఈగా ఉన్న నాగేశ్వరరావు పదవీ విరమణ చేయడంతో సీనియార్టీ ప్రకారం సత్యనారాయణను సీఈగా టీటీడీ నియమించింది. దీంతో ఆయన శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

వంటనూనె తెచ్చిన తంటా

భార్యాభర్తల మధ్య గొడవ ● గుళికల మందు తాగి భర్త ఆత్మహత్య

బంగారుపాళ్యం, సెప్టెంబరు 1: వంటనూనె కారణంగా ఆ భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన భర్త గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రాగిమానుపెంట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు... కీరమంద గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బయ్య (55) రాగిమానుపెంట వద్ద ఓ మామిడి తోటలో కాపలాదారుడిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం భార్యతో కలిసి బంగారుపాళ్యం సంతకు వచ్చాడు. సరుకులు తీసుకుని తిరిగి వెళుతుండగా మార్గమధ్యంలో వంటనూనె జారి కింద పడిపోవడంతో ఇద్దరి మధ్య గొడవ వచ్చింది. జీవితంపై విరక్తి చెందిన సుబ్బయ్య ఇంటికి వచ్చిన తర్వాత వరి పంటకు వేసే గుళికల మందు తాగేశాడు. బంధుమిత్రులు గమనించి బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో సీటు కోసం బ్లేడ్‌తో దాడి



దాడిలో గాయపడ్డ ఆదినారాయణ

చౌడేపల్లె, సెప్టెంబరు 1: బస్సులో సీటు కోసం జరిగిన ఘర్షణలో ఓ యువకుడు ఒక వృద్ధుడిపై బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన చౌడేపల్లెలో ఆదివారం జరిగింది. బాధితుడి కథనం మేరకు.. రామసముద్రం మండలానికి చెందిన ఆదినారాయణ చౌడేపల్లె మండలం కొత్తపల్లెలోని తన కూతురు చిత్ర ఇంటికి వచ్చాడు. కూతురును సొంత ఊరికి తీసుకెళ్లడానికి చౌడేపల్లె బస్టాండుకు వచ్చాడు. ఈ క్రమంలో తిరుపతి నుంచి పుంగనూరు వస్తున్న ఓ ఆర్టీసీ బస్సులో సూరయ్యగారిపల్లెకు చెందిన రాజేష్ పుంగనూరుకు వస్తున్నాడు. చౌడేపల్లెలోకి వచ్చిన బస్సును ఆదినారాయణ, తన కుమార్తెతో కలిసి ఎక్కాడు. సీటు పట్టుకున్నాడు. రాజేష్ కూడా అదే సీటు కోసం వారితో ఘర్షణపడ్డాడు. ఇరువర్గాల ఘర్షణతో బస్సులో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని కండెక్టర్ వారిని దించేశాడు. బస్సు దిగిన రాజేష్ రోడ్డుపై ఉన్న బ్లేడ్ తీసుకుని ఆదినారాయణపై దాడి చేసి పారిపోవడానికి ప్రయత్నించాడు. స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈదాడిలో ఆదినారాయణ చేతికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ బాలసుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు.


పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 1: విజయవాడ నగర ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా రైలు మార్గాలపై వర్షపు నీరు ప్రవహించడంతో తిరుపతినుంచి సికింద్రాబాదు వెళ్లే ప్రత్యేక రైలు, ఆదిలాబాదు నుంచి తిరుపతికి వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లను ఆదివారం రద్దు చేశారు. త్రివేండ్రం నుంచి న్యూఢిల్లీకి వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్‌ను కడప మార్గంలో దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ - గూడూరు మీదుగా చెన్నైకి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్లను అధికసంఖ్యలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి-విజయవాడ మధ్య నడిచే పలు రైళ్లను కూడా రద్దు చేసే అవకాశం ఉందన్నారు.

స్విమ్స్‌లో సీసీ కెమెరాలకు చిక్కిన రోగి

ఒంటరిగానే నడిచి వెళుతున్నట్లు గుర్తించిన పోలీసులు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1: స్విమ్స్‌లో ఐదు రోజుల కిందట కనిపించకుండా పోయిన టి.సీతారామప్ప అదే రోజు వార్డు నుంచి ఒంటరిగా బయటకు వెళ్లిపోయినట్లు తేలింది. స్విమ్స్‌లోని ఓ సీసీ కెమెరాలో దీనికి సంబంధించిన పుటేజీని పోలీసులు, స్విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. వైద్యం కోసం స్విమ్స్‌కు వచ్చి గత నెల 27వ తేదీన స్విమ్స్‌లోని ఏంఐసీయూ వార్డులో అడ్మిట్ అయిన రోగి టి.సీతారామప్ప అదే రోజు అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. అప్పటినుంచి పోలీసులు, స్విమ్స్ సెక్యూరిటీ రోగి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నా ఆచూకీ తెలియరాలేదు. మరోవైపు రోగి ఆచూకీ కోసం తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ రెండు ప్రత్యేక బృందాలనూ ఏర్పాటు చేశారు. ఆదివారం డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి స్విమ్స్ ఆవరణలో వెతికించారు. సీతారామప్ప చికిత్స పొందుతున్న వార్డు నుంచి భవనం వెనుక ఎస్వీ యూనివర్సిటీ వైపు వరకు జాగిలం వచ్చి అక్కడినుంచి వెనుదిరిగింది. అనంతరం శ్రీపద్మావతి భవనంలో ఉన్న సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా.. సీతారామప్ప అడ్మిట్ అయిన ఆగస్టు 27వ తేదీ అర్ధరాత్రి తర్వాత 3.15 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో భవనం వెనుక మార్గంలో నడుచుకుంటూ వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే సీతారామప్ప కుమారుడు విశ్వనాథ్‌ను పిలిపించి ఆ సీసీ పుటేజీలను చూపించగా తన తండ్రే అని గుర్తించాడు. అయితే గ్రౌండ్‌ఫ్లోర్‌లో నడుచుకుంటూ వెళుతున్న పుటేజీ మాత్రమే కనిపించడంతో ఆ భవనం వెనుకనుంచి ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోకి వెళ్లి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఐదు రోజులుగా చిన్నపాటి ఆధారం కూడా లభించకపోవడంతో రోగి బంధువులు కూడా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇపుడీ సీసీ పుటేజీని చూసినవారు కొంత ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడికి వెళ్లి ఉంటాడన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, రోగిని ఎవరూ ఏమీ చేయలేదని ఆయనే వార్డు నుంచి బయటకు వెళ్లాడని, ఇందులో స్విమ్స్ యాజమాన్యం తప్పిదం లేదని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



సీతారామప్ప ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సీసీ కెమెరా పుటేజ



మామండూరు వద్ద లారీ బోల్తా

చంద్రగిరి, సెప్టెంబరు 1: చంద్రగిరి మండలం, మామండూరు వద్ద ఆదివారం తెల్లవారు జామున లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ మధుకు స్వల్ప గాయాలయ్యాయి. కర్నాటక రాష్ట్రం, ముల్బాగల్ నుంచి ఇంటీరియల్ మెటీరియల్ లోడ్డుతో తిరుపతికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే అదుపు తప్పి బోల్తా పడిందని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఎస్వీయూ 70వ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ 70వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించుకోనున్నారు. ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలోని మహనీయుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆవిర్భావ దినోత్సవ సభ నిర్వహిస్తారు. ఇందులో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు పాల్గొంటారు. విద్యార్థులు, ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు.





భాకరాపేట ఘాట్‌లో బోల్తాపడిన లారీ - లారీని ఢీ కొన్న స్కూటర్

భాకరాపేట ఘాట్‌లో కర్రల లారీ బోల్తా

ప్రమాదానికి గురైన లారీని ఢీ కొన్న స్కూటర్ ● ముగ్గురికి గాయాలు

చంద్రగిరి, సెప్టెంబరు 1: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్‌రోడ్డులో కర్రల లోడ్డుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అదే సమయంలో ఈ లారీని భాకరాపేట నుంచి తిరుపతి వైపు వస్తున్న స్కూటర్ ఢీ కొనడంతో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి భద్రాచలానికి కర్రల లోడ్డుతో లారీ బయలుదేరింది. భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఇంతలోనే చంద్రగిరికి చెందిన బాలాజీ, ఆయన భార్య స్వాతి, వదిన మీనా స్కూటర్‌పై వస్తుండగా బోల్తా పడిన లారీని ఢీ కొన్నారు. ఈప్రమాదంలో స్కూటర్‌పై వస్తున్న బాలాజీ, స్వాతి, మీనాకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. సమాచారం చంద్రగిరి ఎస్ఐ రవీంద్ర నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన ఏటీఎం (ఫైల్ ఫొటో)

ఏటీఎంలో చోరీ ఇంటి దొంగల పనే..!

● పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులున్నట్లు సమాచారం

చంద్రగిరి, సెప్టెంబరు 1: చంద్రగిరి పట్టణం కొత్తపేటలోని కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గురువారం రాత్రి జరిగిన చోరీ ఇంటి దొంగల పనే అని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించినట్లు సమాచారం. ప్రస్తుతం పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులున్నట్లు సమాచారం. విశ్వసనీయ కథనం మేరకు.. ఎస్బీఐ ఏటీఎంలలో నగదు పెట్టే ప్రైవేటు సిబ్బంది అయిన కస్టోడియన్ సురేష్ పథకం ప్రకారం ఈనెల 27వ తేదీన కోసూరి కాంప్లెక్స్‌లోని ఏటీఎం మెషీన్‌లో నగదు పెట్టి.. దానికి సంబంధించిన తాళం వేయకుండా, ప్రధాన డోరుకు సంబంధించిన తాళం వేసి వచ్చేశాడు. అదే రోజు రాత్రి నగదు తరలించే వాహన డ్రైవర్ మనోజ్‌కు విషయాన్ని తెలిపాడు. అతను తన స్నేహితుడు మనోజ్‌కు విషయం తెలిపి.. నగదు చోరీకి ప్రణాళిక రూపొందించారు. డ్రైవర్ స్నేహితుడైన మనోజ్ సెక్యూరిటీ వేషధారణలో వచ్చి సురేష్ వద్ద ఉన్న ప్రధాన డోరు తాళంతో ఏటీఎం తెరిచి లోపలున్న నగదును చోరీ చేశాడు. అనంతరం ఇది ఇంటి దొంగల పనే అన్న అనుమానం రాకుండా ఉండటానికి గడ్డపారతో ఏటీఎంను కదిలించి, ధ్వంసం చేశాడు. కాగా, వీరు చంద్రగిరిలోనే కాకుండా తిరుపతిలోని గిరిపురం, అన్నారావు సర్కిల్, తుమ్మలగుంట దగ్గర ఉన్న ఎల్ఎస్‌నగర్‌లోని ఏటీఎంలలో కూడా ఈ తరహాలోనే చోరీ చేసినట్లు గుర్తించారు. ఏటీఎం చోరీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసి, మరో రెండ్రోజుల్లో నిందితులను అరెస్టు చూపి, రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కరాటేలో ప్రతిభ కనబరిచిన చిన్నారులు



పుంగనూరు రూరల్, సెప్టెంబరు1: ఒంగోలులో శనివారం జరిగిన ఇంటర్‌స్టేట్ కరాటే పోటీల్లో పుంగనూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ మన్సూర్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న 10మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొని 8మంది బంగారు, రజితం, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు వివరించారు. పతకాలు సాధించిన వారిలో ముస్తాక్, మహేష్, సాయియోగేంద్ర, ఫరుఖాన్, ముస్తఫా, అనీఫ్, అదిల్, షానూర్‌లను ఆయన అభినందించారు.

కుప్పంలో అమల్లోకి 30 పోలీస్ యాక్ట్

కుప్పం, సెప్టెంబరు 1: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సెప్టెంబరు 1 నుంచి అంటే ఆదివారం నుంచి 30 పోలీస్ యాక్ట్ అమల్లోకి వచ్చిందని డీఎస్పీ పార్థసారథి తెలిపారు. ఈ యాక్ట్ ఈ నెల 30వ తేదీ దాకా అమల్లో ఉంటుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదన్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఉన్న కుప్పం అర్బన్, గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీసు స్టేషన్‌లు 30 పోలీస్ యాక్ట్ పరిధిలోకి వస్తాయని చెప్పారు. ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు.

శెట్టిపల్లె సర్పంచ్‌కు సన్మానం



గుడుపల్లె, సెప్టెంబరు1: మండల పరిధిలోని శెట్టిపల్లె సర్పంచ్ రీటా యల్లప్ప పంచాయతీలో ప్రజలకు ఉత్తమ సేవలను అందించినందుకు ఆగస్టు 15వ తేదీన రాష్ట్రపతి భవన్‌లో గవర్నరు విందులో పాల్గొన్నారు. ఈ క్రమంలో మండల జన సేన అధ్యక్షులు అమీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు సర్పంచ్ రీటా యల్లప్పను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు స్ఫూర్తితో శెట్టిపల్లెను ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు.

బాలకృష్ణ అభిమానుల దుస్తుల వితరణ



గుడుపల్లె, సెప్టెంబరు1: నటుడు నందమూరి బాలక్రిష్ణ సినీ ప్రస్థానం 50 వసంతాలు పూర్తిచేసుకోవడంతో ఆదివారం ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఎన్‌బీకే సేవా సంస్థ అధ్యక్షులు కె.లీలా వినోద్ ఆధ్వర్యంలో పలు ఆలయాల్లో బాలక్రిష్ణ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేశారు. అన్న దానం చేశారు. సినిమా థియోటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు దుస్తులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ యువత అధ్యక్షుడు వెంకటేష్, పార్టీ అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాటాడుతున్న సోమచంద్రారెడ్డి

గంగవరం, సెప్టెంబరు 1: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం నాయకులు సోమ చంద్రారెడ్డి కోరారు. ఆదివారం పలమనేరులోని బాలి కోన్నత పాఠశాలలో పెన్షనర్ల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొనే వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఒత్తిడిలకు గురవుతున్నారన్నారు. ఈహెచ్ఎస్ కార్డులు లేక వైద్యం పొందడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎవరైనా పెన్షనర్లు చనిపోతే వారి దహన ఖర్చుల చెల్లింపుల విషయంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు నాగభూషణం, శ్రీనివాసులు, క్రిష్ణప్ప, దొరస్వామి, జగదీష్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 3 నుంచి దసరా మహోత్సవాలు

గంగవరం, సెప్టంబరు 1: అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు పలమనేరు ఎస్టీకాలనీలో వెలసిన కనకదుర్గాదేవి దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక ఆలయంలో ఉత్సవాల నిర్వహణపై అలయ కమిటీ సమావేశమైంది. 3న అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనంతో ప్రారంభ మయ్యే ఉత్సవాలు 12న రాజరాజేశ్వరీ దేవి దర్శనంతో ముగించాలని నిర్వహించాలని నిర్ణయించారు. భక్తులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీ.రమణ, సీపీ ప్రకాష్, రత్నమ్మ, వెంకటేశులు, తేజ, సోమశేఖర్, నేతాజి, తిరుమలరావు, యువరాజ్, ధనలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేషస్పందన



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 1: బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వైద్యనిపుణులు 56 మందికి కంటిపరీక్షలు జరిపి 9 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చినవారికి నిర్వాహకులు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఈఎస్ వైద్యులు డాక్టర్ లిఖిత, పీఆర్వో చంద్ర, మహతి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మూతబడిన బాలికల వసతి గృహం



సోమల, సెప్టెంబరు 1: సోమలలో ఎస్సీ బాలికల కోసం నిర్మించిన వసతి గృహం రెండేళ్లగా మూత బడింది. ఎస్సీలే కాకుండా బీసీలు, ఇతర వెనుకబడిన 120 మంది విద్యార్థులకు సరిపోయేలా ఈ వసతి గృహం నిర్మించారు. అయితే అధికారులు అడ్మిషన్లపై అవగాహన కల్పించకపోవడంతో 20 మందితో కొంత కాలం వెళ్లదీశారు. అదేసమయంలో ఇక్కడ పనిచేస్తున్న సంక్షేమ అధికారి ఝాన్సీ అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి బదిలీ అయ్యారు. దీంతో చౌడేపల్లెకు చెందిన సంక్షేమ అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఈక్రమంలో చేరిన 20 మందిని చౌడేపల్లి హాస్టల్‌కు బదిలీ చేసి సోమల వసతి గృహానికి తాళం వేశారు. అధి కారుల స్పందించి బాలికల వసతి గృహంలో విద్యార్థులను చేర్పించి భవనాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కడా పీడీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే

కుప్పం, సెప్టెంబరు 1: కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంటదాకా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. తన ఆధ్వర్యంలో జరిగే ఈ వేదికలో నియో జకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించుకుంటే తగిన పరిష్కారాలు చూపిస్తామని చెప్పారు.

10నుంచి 'పొలం పిలుస్తోంది'

పుంగనూరు రూరల్, సెప్టెంబరు1: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10 తేదీ నుంచి 'పొలం పిలుస్తోంది' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ టెక్నికల్ అధికారి ఫయాజ్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తామని తెలియజేశారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన వివరించారు.

రిక్రియేషన్ క్లబ్‌లో ఉచిత కంటిపరీక్షలు



గంగవరం, సెప్టెంబరు 1: పలమనేరు క్రికియేషన్ క్లబ్‌లో ఆదివారం నిర్వ హించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 50 మందిని ఆపరేషన్‌కు ఎంపికచేసినట్లు క్లబ్ నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి మొత్తం 90 మంది హాజరయ్యారు. 50 మందికి కంటిసమస్యలు ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామని క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వి.కోట, సెప్టెంబరు 1: వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. రసాయన శాస్త్రంలో ఎమ్మెస్సీ పూర్తిచేసి 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సెప్టెంబరు 3వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని తెలియజేశారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, సెప్టెంబరు1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పిచారు. అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో సౌందర్య లహరి పారాయణం



చౌడేపల్లె, సెప్టెంబరు1: మండలంలోని పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయంలో హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీసరస్వతి ఆధ్వర్యంలో ఆదివారం 200 మహిళలు సౌందర్య లహరి పారాయణం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్మిక సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం



కార్మిక సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

కుప్పం, సెప్టెంబరు 1: కార్మిక సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పంలోని చంద్రన్న కార్మిక భవనంలో ఆదివారం కార్మిక సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆటోనగర్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చొరవతో స్థల సేకరణ ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఆ ప్రయత్నాలు పూర్తయి స్థలాన్ని సేకరించిన వెంటనే ఆటో నగర్ నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పిస్తుందన్నారు. నియోజకవర్గంలోని సకల కార్మిక సంఘాల కోసం ప్రస్తుతమున్న చంద్రన్న కార్మిక భవనం వద్దగల ఖాళీ ప్రదేశంలో భవన నిర్మాణ ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే వినాయక పెయింట్ అసోసియేషన్‌తో సభ్యులతో రాజ్ కుమార్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో, అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సమావేశాలలో కార్మికులు, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటిచికిత్స శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 1: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన కంటివెలుగు కంటిచికిత్స శిబిరం ఆదివారం ముగిసింది. ఈ శిబిరంలో రెండు రోజుల్లో 874మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి చికిత్సలందించారు. 139మందిని శస్త్రచికిత్సలకు, 621 మందిని అద్దాలకు సిఫార్సు చేశారు. వారికి కుప్పం ప్రభుత్వాస్పత్రిలో త్వరలోనే శస్త్ర చికిత్సలు చేయిస్తామని, అందరికీ ప్రభుత్వమే అద్దాలు అందిస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు దీప, లోకేశ్, కంటి వైద్యనిపుణురాలు అర్పిత తెలిపారు. ఆదివారం టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు పర్యవేక్షించారు. శిబిరాలకు హాజరైన వారికి పార్టీ శ్రేణుల సహకారంతో నేతలు భోజనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు బాబు, ఎంపీడీవో ఈశ్వరన్న, టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తి, సీతాపతి జనసేన మండల అధ్యక్షుడు హరీష్, వెంకటరమణ పాల్గొన్నారు.

బాలయ్య అభిమానుల అన్నదానం



కేక్ కట్ చేస్తున్న బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు

పుంగనూరు. సెప్టెంబరు1: సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సినీ రంగంలో 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక గోకుల్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. బాలకృష్ణ అభిమాన సంఘనాయకులు అప్పిరెడ్డి, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్, మాధవరెడ్డి, సీవీరెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, శమీపతి, ప్రకాశ్, వెంకటరెడ్డి, గంగులప్ప, మణి, లక్ష్మణరాజు, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, సుబ్బి, కిరణ్, గంగరాజు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషిచేస్తా: అమర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, సెప్టంబరు 1: బ్రాహ్మణ సంఘ సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గంగవరం మండలంలోని కీలపట్లలోని ఓ కల్యాణ మండపంలో గాయత్రి బ్రాహ్మణ సంఘ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత బ్రాహ్మణ సంఘ నేతలు మాట్లాడుతూ ఆలయాలలో ధూపదీప నైవేద్యాలతో పాటు అర్చకులకు అందుతున్న గౌరవవేతనం గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘ సంక్షేమానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం బ్రాహ్మణ సంఘ అభ్యున్నతికి విశేషంగా కృషిచేస్తున్న బ్రాహ్మణ పెద్దలను, అన్నం సొసైటీ కళ్యాణ మండపానికి సహ కరించిన దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు కిషోర్, చంద్రమౌళి, వైకే రెడ్డెప్ప, సర్పంచ్ చంద్రశేఖర్, హను మంతరావు టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్ నాయుడు, వేణు, రాము, రవి, ఆర్‌బీసీ కుట్టి, గిరిబాబు, మదన్, గంటావూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు





గాయపడిన బీరప్ప, చాంప్లానాయక్

రామకుప్పం, సెప్టెంబరు 1: మండలంలోని పీఎంతాండా గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. అటవీశాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న బీరప్ప ఆదివారం ఉదయం పీఎంతాండా నుంచి ననియాలకు ద్విచక్రవాహనంలో పయనమయ్యాడు. చాంప్లానాయక్ అనేవ్యక్తి ద్విక్రవాహనంలో ననియాల నుంచి పీఎంతాండాకు వస్తున్నాడు. మార్గమధ్యంలో పీఎంతాండా మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో బీరప్ప, చాంప్లానాయక్‌లు కింద పడిపోయారు. బీరప్పకు తలపై, చేతులపై తీవ్రగాయాలయై ముక్కు, చెవులలో రక్తస్రావమైంది. చాంప్లానాయక్ కుడికాలు విరిగిపోయింది. స్థానికులు వారిని 108 లో రామకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సలందించిన వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుప్పం ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా పాలేటమ్మ మలి జాతర







ప్రత్యేక అలంకరణలో మూలవిగ్రహాలు, సిద్ధపూజలు, ఆకట్టుకుంటున్న అమ్మవారి విద్యుత్ కటౌట్

సోమల, సెప్టెంబరు 1: మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మ వారి ఆలయంలో ఆదివారం మూల విగ్రహాలకు విశేష పుష్పాలంకరణలు జరిపి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం వద్ద ఉపవాసదీక్షలో ఉన్న సిద్ధులకు దీక్షలు విరమించడానికి అల్పాహారం అందజేశారు. రాత్రి మలి జాతరకు భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కమ్మపల్లె, తెట్టుపల్లె, బోయపల్లె, బురుజుపల్లె, కంచెంవారి పల్లె, గొల్లపల్లె, చింతలవారిపల్లె, ముండ్రి వారిపల్లె తదితర గ్రామాల నుంచి చాందినీ బండ్లు ఊరేగింపుగా వచ్చాయి. మంగళ వాయిద్యాలు, డీజే, కోలాటాల నడుమ ఊరేగింపుగా కోలాహలంగా సాగింది. చాందినీ బండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాయి. పలు గ్రామాల మహిళలు బాణసంచావేడుకలతో, ఉపవాస దీక్షలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. ఆసాదివారు రాత్రి జాగరణలతో అమ్మవారిని కీర్తిస్తూ జీవిత విశేషాలను భక్తులకు వివరిం చారు. అలాగే గ్రామాల పరిధిలోని పొలిమేర అమ్మవార్లకు బోణాలు, దీలు సమర్పించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రామకుప్పానికి ఎస్ఐ కావాలి



రామకుప్పం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఖాళీ గంజాయి పొట్లాలు

రామకుప్పం, సెప్టెంబరు 1: రామకుప్పం మండలంలో ఎస్ఐ పోస్టు నెలన్నర రోజులుగా ఖాళీగా ఉంది. ఇక్కడ ఎస్ఐగా ఉన్న శివకుమార్ నెలన్నర క్రితం వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఒకరిద్దరు ఎస్ఐలను ఇక్కడికి బదిలీ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేసినా ఎందుకో గానీ వారు జాయిన్ కాలేదు.

గాలిలో దీపంలా శాంతిభద్రతలు

గ్రామాల్లో భూతగాదాలు, కుటుంబ తగాదాలు వంటి సమస్యలపై ప్రతి రోజూ ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఆ సమస్యలు పరిష్కరించడంలో స్థానిక పోలీసు సిబ్బంది సతమతమవుతున్నారు. దీంతో తరచూ ఉన్నతాధికారులు రామకుప్పం పోలీస్ స్టేషనులో గడపాల్సి వస్తోంది. అంతేకాకుండా రామకుప్పంతో పాటు మండల వ్యాప్తంగా గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు ఎక్కువయ్యాయి. పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలు, అంగన్వాడీకేంద్రాలు, ప్రాథమికపాఠశాలల ఆవరణలు, దిగువవీధిలోని అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్ల వద్ద కొందరు యువకులు, వైఎస్సార్ సర్కిల్, కోదండరామనగర్, ఇందిరానగర్‌లకు చెందిన యువకులు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పై ప్రాంతాల్లో ఎక్కడ చూసినా గంజాయి తీసుకొని పడేసిన సిల్వర్ కలర్ పేపర్లు దర్శనమిస్తున్నాయి. గంజాయికి అలవాటు పడ్డ యువకులు తరచూ గొడవలకు దిగుతున్నారు. బాధ్యతలు మరిచి జులాయిగా తిరుగుతున్నారు. పట్టణంతో పాటు గ్రామగ్రామాన బెల్టు షాపుల్లో రోజూ లక్షల్లో కర్ణాటక మద్యం, సారా విక్రయాలు సాగుతున్నాయి. చెరువుల నుంచి ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. కొందరు ఇసుకను తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు దాటిస్తున్నారు. మండలం మీదుగా తమిళనాడు నుంచి రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు అడ్డుఅదుపు లేకుండా జరుగుతోంది. కొందరు అటవీ అధికారుల సహకారంతో అటవీప్రాంతంలో సారా తయారీ జోరుగా సాగుతోంది. సారా తయారీదారులు కర్ణాటక రాష్ట్రం నుంచి నల్లబెల్లం, తుమ్మచెక్కలను దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఎస్ఐని నియమించి మండలంలో శాంతిభద్రతలను పరిరక్షించి, అక్రమ కార్యకలాపాలకు చెక్‌పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

25 లీటర్ల సారా స్వాధీనం



రొంపిచెర్ల, సెప్టెంబరు 1: మండలంలో 25 లీటర్ల సారాను పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి కథనం మేరకు.. పోలీసులకు ముందుగా అందిన సమాచారం మేరకు చిచ్చిలివారిపల్లి పంచాయతీ లోకవారిపల్లి సమీపంలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 25 లీటర్ల సారా, 300 లీటర్ల ఊటను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలకు తరలిరండి

సోమల, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా సోమవారం జరిగే కార్యక్రమాలకు అభిమానులు, కూటమి నాయకులు తరలిరావాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్ కోరారు. యూత్ సభ్యులచే స్కూటర్ ర్యాలీ, పార్టీ పతాక ఆవిష్కరణ, అన్నదాన, రక్తదాన శిబిరం నిర్వస్తామని వివరించారు.

రహదారి నియమాలు పాటించాలి

సోమల, సెప్టెంబరు 1: ద్విచక్ర వాహనదారులు రహదారి నియమాలు పాటించాలని ఎస్ఐ శివశంకర కోరారు. ఆదివారం సోమల -సదుం, కలికిరి కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరిం చాలని సూచించారు. కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కంకరతేలిన రోడ్లకు మోక్షం కలిగేనా..?



రాకపోకలకు ఇబ్బందిగా మారిన నాయనపాకాల రోడ్డు

సోమల, సెప్టెంబరు 1: మండలంలోని గ్రామీణ రోడ్లు కంకరతేలి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లను ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. సోమల నుంచి నంజంపేట మీదుగా సాగే నాయనపాకాల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చేవాహనాలు కనబడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చినుకుపడితే రోడ్లు జలమయం అవుతున్నాయి. సోమల సచివాలయం వద్ద గుంతలకు మరమ్మతులు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు

సోమల, సెప్టెంబరు1: తొలిసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి ఆదివారానికి 30 ఏళ్లు అయిన సందర్భంగా టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్ర మణ్యం నాయుడు ఆధ్వర్యంలో కందూరులో స్వీట్లు పంచారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. బోయకొండ దేవస్థానం మాజీ సభ్యుడు బీ.శ్రీనివాసులు, మాజీ ఎంపీ టీసీ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ శంకర్, సుబ్బ రాయుడు, పాల సురేశ్, రెడ్డిమోహన్, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

కాణిపాక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



గంగవరం, సెప్టెంబరు 4: ఈ నెల 7 తేదీ నుంచి జరిగే కాణిపాకం బ్రహ్మో త్సవాలకు రావాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం ఈవో గురుప్రసాద్ కోరారు. ఆదివారం పలమ నేరులోని అమర్ నివాసానికి విచ్చేసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అర్చకులు వేద మంత్రాలతో అమరనాథరెడ్డి దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందించారు.

నేడు రక్తదాన శిబిరం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు1: స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగసంఘం ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులు మధుబాల, నాగేనాయక్, అక్బర్ తెలిపారు. యువత అధిక సంఖ్యలో రక్తదానం చేయాలని కోరారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన అవసరం


మారథాన్‌ను ప్రారంభిస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 1: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి అన్నారు. ఆదివారం మెసానికల్ మైదానం నుంచి వీవీకేఎస్ వరకు 2.5, 5కే మారథాన్ నిర్వహించారు. జీజేఎం ట్రస్టు ఛైర్మన్ చెన్నకేశవులునాయుడు జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హెచ్ఐవీపై అవగాహన కల్పించడం కోసమే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

చిత్తూరు, సెప్టెంబరు 1: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ఆధ్వర్యంలో శనివారం చిత్తూరు నగరంలో వాహనాల తనిఖీ చేపట్టారు. 8 మంది మద్యం తాగి వాహనాలు నడపగా వారిని సివిల్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ. 10వేలు వంతున 8 మందికి రూ. 80వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ద్విచక్ర వాహనం చోరీ

విజయపురం, సెప్టెంబరు 1 : మండలంలోని కనకమ్మసత్రం(మహారాజపురం) వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. కేశవపురానికి చెందిన జయరామరాజు ఆస్పత్రికి వెళ్లి బయటకు రాగా, వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలో తరచూ చోరీలు జరుగుతున్నాయని, పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 1: వేపంజేరి లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం, భక్తిగీతాలు, అన్నమయ్య కీర్తనలు వినిపించారు. ఆలయ మాజీ ట్రస్టీ శ్రీధర్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు బియ్యం, పూజా సామగ్రి వితరణ చేశారు.

చీటీలు వేస్తున్నారా..జాగ్రత్త అవసరం

చిత్తూరు, సెప్టెంబరు 1: కష్టపడి సంపాదించిన డబ్బుతో చీటీలు వేస్తుంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ మణికంఠ సూచించారు. రిజిస్ట్రేషన్లు లేని చిట్స్ కంపెనీల్లో చీటీలు వేయరాదని తెలిపారు. బ్యాంకులు, పోస్టాఫీసులు లేదా రిజిస్టర్ చేసిన చిట్‌ఫండ్ కంపెనీల్లో పెట్టడం ద్వారా డబ్బుకు భద్రత ఉంటుందని పేర్కొన్నారు. అనధికార చిట్స్ నిర్వహించడం నేరమని, అలంటి వారు కేసుల్లో ఇరుక్కునే అవకాశముందని వివరించారు.

సకాలంలో వైద్యం అందక ఆవు మృతి

విజయపురం, సెప్టెంబరు 1: సకాలంలో వైద్యం అందక తన ఆవు మృతి చెందిందని, దీనికి పశు వైద్యాధికారులు బాధ్యత వహించాలని మండలంలోని జగన్నాథపురం రైతు వెంకటేశులు అన్నారు. వారం రోజుల క్రితం చూలు ఆవును రూ.60 వేలకు కొనుగోలు చేశానని, మేత మేయకపోవడంతో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆయన వైద్యం చేసినా లాభం లేకపోయిందన్నారు. మండల పశువైద్యాధికారికి ఫిర్యాదు చేస్తే కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో ఆవు మృతి చెందిందని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి


మునిరాజు(ఫైల్‌ఫొటో)

విజయపురం, సెప్టెంబరు 1: మాజీ వైస్ ఎంపీపీ మునిరాజు(65) ఆదివారం విజయపురంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన టీడీపీలో క్రియాశీలక నేతగా, ఎంపీటీసీగా పనిచేశారు. మృతిపట్ల జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రవిరాజు సంతాపం వ్యక్తం చేశారు.

దుస్థితిలో ఆయుర్వేద వైద్యశాల భవనం

పెచ్చులూడి పడుతున్న పైనం

ఆందోళనలో రోగులు, సిబ్బంది



పెచ్చులూడిన భవనం - పిచ్చిమొక్కల మధ్య దుస్థితిలో ఆయుర్వేద వైద్యశాల భవనం

వెదురుకుప్పం, సెప్టెంబర్ 1 : కార్వేటినగరం మండలం డీఎంపురంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం దుస్థితికి చేరుకుంది. ఇప్పటికే పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉంది. వర్షం వస్తే నీరు లోనికి ప్రవేశిస్తూ మందులు, రికార్డులు పూర్తిగా తడిసిపోతున్నాయి. వాటిని రక్షించలేక సిబ్బంది నానా అవస్థలు పడాల్సి వస్తోంది. చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి విష పురుగులు లోనికి వస్తున్నాయి. కొత్త భవనం నిర్మించాలని గత వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి చెప్పినా కార్యరూపం దాల్చలేదని వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.దీపిక తెలిపారు. కాంపౌండరు, ఎంఎన్‌వో, పీటీఎస్ పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో వైద్య సేవలు సరిగా అందించలేకపోతున్నామన్నారు. భవనం దుస్థితి చూసి ఆస్పత్రికి రావడానికే భయమేస్తోందని స్థానికులు చెబుతున్నారు. కొత్త పాలకులైనా దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

తెలుగు వారి ప్రతిభ ప్రపంచం గుర్తించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 1: తెలుగువారి ప్రతిభ ప్రపంచదేశాలు గుర్తించేలా పనిచేయాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం బెంగళూరులో టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో 'నవశకం-మంచిరోజులు వచ్చేశాయి' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ఫోరం ప్రతి రాష్ట్రంలోనూ ఏర్పడాలని, తెలుగు వారి ప్రతిభ ప్రపంచదేశాలు గుర్తించాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు కర్ణాటకలో ధైర్యంగా రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. బెంగళూరులో తెలుగు వారికి ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే సబిత, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, రాంభూపాల్ రెడ్డి, బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

పవన్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

వెదురుకుప్పం, సెప్టెంబరు 1: డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ తెలిపారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, పెనుమూరు, ఎస్ఆర్‌పురం, గంగాధరనెల్లూరు, పాలసముద్రం మండలాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కంటి ఆపరేషన్‌కు ఎంపిక

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 1: ఉచిత కంటి ఆపరేషన్‌కు 50మందిని ఎంపిక చేసినట్లు చర్చి పాస్టర్ సురేష్ తెలిపారు. వేల్కూరు ఇందిరా నగర్ కాలనీలోని చర్చి వద్ద ఆదివారం చెన్నైకి చెందిన ఎం.ఎన్.హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు చేశారు. 50మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు.

బుగ్గ దేవాలయంలో పవిత్రోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నగరి, సెప్టెంబరు 1: బుగ్గ అగ్రహారం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహించారు. ఆలయాన్ని శుద్ధిచేసి, పుష్పాలతో అలంకరించారు. మండపం వద్ద ఉత్సవ విగ్రహాలకు, కలశాలకు అభిషేకం చేశారు. పట్టువస్త్రాలతో అలంకరించి, హోమ పూజలు చేశారు. చెన్నై నుంగబాక్కంకు చెందిన ఆదిత్యా గ్రూప్ ఆడిటర్ రూ.84వేలు విరాళంగా ఇచ్చారు. చెక్కును ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నమ్మకు అందించారు.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే మురళిమోహన్‌కు, గల్లా దంపతులకు పత్రిక అందజేస్తున్న ఈవో

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 1: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ను ఈవో గురుప్రసాద్ ఆహ్వానించారు. ఆదివారం చిత్తూరులోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. వేద పండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. అనంతరం మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, ప్రముఖ పారిశ్రామికవేత్త గల్లా రామచంద్రనాయుడును ఎమ్మెల్యే బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, నాయకులు దొరబాబు చౌదరి, దిలీప్‌కుమార్, హేమాద్రినాయుడు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ చంద్రబాబు : టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

నగరి, సెప్టెంబరు 1 : తెలుగు రాష్ట్రాలలో అభివృద్ధి అంటే చంద్రబాబు పేరే గుర్తుకు వస్తుందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. నగరి పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు రమేష్‌బాబు అధ్యక్షతన ఆదివారం సమావేశమయ్యారు. చంద్రబాబు సీఎంగా మొదటిసారి ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ పార్టీని ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ఐటీని తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించిన ఏకైక నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. ఆయన నాయకత్వంలోనే నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సరికొత్తగా రూపుదిద్దుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలాధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు, దేశమ్మగుడి మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి నాయుడు పాల్గొన్నారు.

ప్రేమ, సేవాతత్వాన్ని అలవర్చుకోవాలి

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 1: ప్రతి ఒక్కరూ ప్రేమ, సేవాతత్వాలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడాలని సిద్ధి సమాధి యోగా గురువు నరేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం విజయం విద్యా సంస్థల్లో యోగా అవగాహన తరగతులు నిర్వహించారు. ఆహార అలవాట్లు, యోగాసనాలు, పంచకోశ శుద్ధి, సూర్య నమస్కారాలు, వాటి ఉపయోగాల గురించి వివరించారు.

వృద్ధులకు అన్నదానం



వెదురుకుప్పం, సెప్టెంబరు 1: కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం తిరుపతి చెన్నారెడ్డికాలనీకి చెందిన బి.దేవీవరప్రసాద్ అన్నదానం చేశారు. స్వీట్లు పంచిపెట్టారు. వృద్ధులకు అందరూ చేయూతనివ్వాలని కోరారు.

నిరుపయోగంగా కార్యాలయం



వెదురుకుప్పం, సెప్టెంబరు 1: కార్వేటినగరం ఇరిగేషన్ ఏఈ కార్యాలయం నిరుపయోగంగా ఉంది. లక్షలాది రూపాయలు వ్యయం చేసి నిర్మించిన కార్యాలయాన్ని కొంతకాలంగా వినియోగించకపోవడంతో దుమ్ము బూజు పట్టిపోయింది. ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచి విష పురుగులకు నిలయంగా మారింది. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

రోజా వ్యాఖ్యలు బాధాకరం : టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 1: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని మాజీ మంత్రి రోజా పేర్కొనడం విడ్డూరంగా ఉందని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి విమర్శించారు. గుడ్లవల్లేరు కళాశాలలో హిడెన్ కెమెరాలు ఉన్నాయన్న ప్రచారం బ్లూ మీడియా సృష్టేనని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి వైసీపీ నేతలు ఈ విధంగా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలోనూ హోం మంత్రిగా మహిళే ఉన్నారని, అప్పుడు మహిళలపై అఘాయిత్యాలు జరిగితే రోజా ఎందుకు స్పందించలేదో చెప్పాలని నిలదీశారు. ప్రజలు ఛీకొట్టినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని దుయ్యబట్టారు.

నత్తనడకన హైవే పనులు : అవస్థల్లో వాహనదారులు




గుడిపాల, సెప్టెంబరు 1: మండలంలోని బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలో హైవే నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొమ్మసముద్రం రైల్వేగేటు వద్ద సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసిన తర్వాత సిక్స్‌వే పనులు చేయాల్సి ఉంది. అయితే హైవే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అటు తమిళనాడుకు పోవాలన్నా... ఇటు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లాలన్నా నడిచి లేదా ఐదు కిలోమీటర్ల దూరం వరకు ఆటోలో వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి, వాహనాలు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మరమ్మతులు చేసిన వారానికే..



పెనుమూరు, సెప్టెంబరు 1: రోడ్డుపై పడిన గుంతకు మరమ్మతులు చేసిన వారానికే మళ్లీ రంధ్రం పడింది. కొన్ని రోజుల క్రితం పెనుమూరు నుంచి చిత్తూరు మార్గంలో రేణుకానగర్ మలుపు వద్ద కల్వర్టుకు రంధ్రం పడింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వారం క్రితం మరమ్మతులు చేశారు. మళ్లీ అదేచోట రంధ్రం ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

వాహనం ఢీకొని యాచకుడి మృతి



నింద్ర, సెప్టెంబర్ 1: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ ఏలుమలై వివరాల మేరకు.. తిరుపతి-చెన్నై జాతీయ రహదారి నేతమ్స్ షుగర్స్ కర్మాగారం కొప్పేడు వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం నడిచి వెళుతున్న యాచకుడిని ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నింద్ర పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పది పడకల ఆస్పత్రి మంజూరు చేయండి

వెదురుకుప్పం, సెప్టెంబరు 1: వెదురుకుప్పానికి పది పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని టీడీపీ మండల నేత పేట చూడామణిరెడ్డి కోరారు. ప్రస్తుతమున్న ఆరోగ్య ఉప కేంద్రంతో సరైన వైద్య సేవలు అందడం లేదన్నారు. గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలకు దాన్ని పది పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

ఉట్లోత్సవంలో యువత సందడి

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 1: నగరంలోని కృష్ణమందిరాల్లో ఆదివారం ఉట్టి మహోత్సవాలతో కృష్ణాష్టమి వేడుకలు ముగిసాయి. చర్చివీధిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టి మహోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హైరోడ్డులోని కృష్ణ మందిరంలో స్వామికి పూజలు చేసి, ఉట్టి మహోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉట్లోత్సవాన్ని తిలకించారు. అన్నదానం చేశారు.